తెలంగాణా స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి    వికారాబాద్
శనివారం
12 సెప్టెంబర్ 2026
పేజీలు : 08



# పౌష్టికాహారంలో నిర్లక్ష్యానికి తావులేదు

**ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్**

## గర్భిణులు, చిన్నారులు, విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

### లోపాలు తేలితే చర్యలు తప్పవు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** గర్భిణులు, చిన్నారులు, విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ స్పష్టం చేశారు. నాణ్యమైన ఆహారం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిషన్ సభ్యులు ఆనంద్, జ్యోతితో కలిసి ఆయన శుక్రవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో పర్యటించారు.

**రేషన్ దుకాణాల్లో తనిఖీ**

మేడ్చల్‌లోని చౌక ధరల దుకాణాలను కమిషన్ బృందం పరిశీలించింది. డీలర్ వద్ద స్టాక్, రిజిస్టర్ల నమోదును తనిఖీ చేశారు. దుకాణాల వద్ద ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి, తహసీల్దార్ల ఫోన్ నంబర్లను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. సన్నబియ్యం సక్రమంగా అందుతున్నదా? డీలర్లు ఇబ్బంది లేకుండా బియ్యం పంపిణీ చేస్తున్నారా? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

**భోజనం బాగోలేదన్న విద్యార్థులు**

దమ్మాయిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కమిషన్ బృందం తనిఖీ చేసింది. విద్యార్థులు పెద్ద సంఖ్యలో లంచ్ బాక్సులు తెచ్చుకోవడాన్ని గమనించి కారణం అడిగారు. పాఠశాలలో అందించే భోజనం సరిగా ఉండటం లేదని విద్యార్థులు కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై కమిషన్ తీవ్రంగా స్పందించింది. లోపాలను ఉపేక్షించబోమని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టం చేస్తూ.. తాము మరోసారి వచ్చి పరిశీలిస్తామని హెచ్చరించింది.

**అంగన్‌వాడీల్లో పౌష్టికాహారంపై ఆరా**

దమ్మాయిగూడ, అంబేద్కర్‌నగర్, జవహర్‌నగర్, మల్కాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను కమిషన్ బృందం సందర్శించింది. కేంద్రాల్లో ఉన్న చిన్నారుల సంఖ్య, హాజరవుతున్న గర్భిణుల వివరాలను తెలుసుకున్నారు. వారికి తగిన మోతాదులో పౌష్టికాహారం, గుడ్లు, పాలు అందుతున్నాయా? అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజన మెనూను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు.

గర్భిణులు, 14 ఏళ్లలోపు పిల్లలకు పౌష్టికాహారం పొందడం చట్టబద్ధమైన హక్కు అని శ్రీనివాస్ తెలిపారు. ఆ హక్కుకు ఎలాంటి భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత కమిషన్‌పై ఉందన్నారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ గర్భిణులకు కమిషన్ సభ్యులు తమ ఫోన్ నంబర్లను అందజేశారు.

ఈ పర్యటనలో నోడల్ అధికారి సాంబశివరావు, జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ అధికారులు ఝాన్సీరాణి, వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఎంహెచ్‌వో ఆనంద్, పౌరసరఫరాల అధికారులు సుగుణబాయి, శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

### గుడ్ల రంగు మారడంపై పరీక్షలు

కిష్టాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి డైనింగ్ హాల్, స్టోర్‌రూమ్‌లను పరిశీలించారు. సరుకుల గడువు తేదీలను తనిఖీ చేసి, గడువు ముగిసిన ఆహార పదార్థాలను వినియోగించవద్దని సూచించారు. నాణ్యమైన సన్నబియ్యంతోనే వంట చేయాలని, నాణ్యతలో లోపాలుంటే వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి మార్చుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందించిన ఉడికించిన గుడ్ల రంగు మారడాన్ని గమనించిన కమిషన్ చైర్మన్ కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గుడ్ల నమూనాలను సేకరించి ఫుడ్ సేఫ్టీ అధికారులతో పరీక్షలు నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య పరీక్షల రిజిస్టర్లను పరిశీలించి రక్తహీనత ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు.



### విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కమిషన్

పేరెంట్స్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారా? అని అడిగి రిజిస్టర్లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో సమస్యలు ఉన్నాయా? మెను ప్రకారం అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందుతున్నాయా? తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉన్నాయా? అని ఆరా తీశారు.

సమస్యలుంటే నిర్భయంగా తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. నిజాన్ని చెప్పే ధైర్యం ఉంటేనే సమస్యలను ఎదుర్కొని భవిష్యత్తులో సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించగలరని శ్రీనివాస్ వారికి సూచించారు.

---

## గొట్లపల్లి వీధి దీపాల నిధుల్లో గోల్మాల్

### తీర్మానానికి విరుద్ధంగా చెల్లింపులు

- ఆన్లైన్లో ఒక నోట్ ఫైల్, ఆర్టిఐలో మరొక నోట్ ఫైల్
- ఆర్టిఐ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన దొంగనోట్ ఫైల్ ఉదాంతం
- విలేకరుల సమావేశంలో బంగారు నవీన్ వెల్లడి

**పెద్దేముల్ సెప్టెంబర్ 11(జనంసాక్షి)** మండల పరిధిలోని గొట్లపల్లిలో ఏర్పాటు చేసిన వీధిదీపాల నిధుల్లో అధికారులు చేతివాటం ప్రదర్శించి.. గోల్మాల్ చేశారని బాధితుడు బంగారు నవీన్ ఆరోపించారు. శుక్రవారం పెద్దేముల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించి పలు వివరాలు వెల్లడించారు. గ్రామపంచాయతీలోని పలు వీధుల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని 12.02.2005 నాడు నాకు తీర్మానం ఇచ్చారని, తీర్మానం మేరకు నేను వీధి దీపాలు ఏర్పాటు చేశానని తెలిపారు. వీధి దీపాలకు సంబంధించి ఏఈ లోపలి పేజిలో



---

## పిల్లలను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- **మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్**
- **చందానగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి పదవీ విరమణ సన్మానం**



**మొయినాబాద్ సెప్టెంబర్ 11(జనం సాక్షి) :** బావిభారత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎస్బిఎఫ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు యూ. పోచయ్య, చందానగర్ సర్పంచ్ మురళీకృష్ణగౌడ్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చందానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా కొనసాగిన శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు పాల్గొని సన్మానించి మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీవితం ఎంతో ఆనందదాయకమని అన్నారు. సమాజంలో పిల్లలను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దడమే కాకుండా వారి భవిష్యత్తుకు విజ్ఞానాన్ని పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులనే అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు పని చేస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు సక్రమంగా విద్యాబుద్ధులు నేర్పించినప్పుడే ఉపాధ్యాయులు ఎక్కడ ఉన్న మరచిపోకుండా గుర్తు చేసుకుంటారని తెలిపారు. మంచి ఉద్యోగ, వ్యాపారంలో స్థిరపడి ఉన్న విద్యార్థులు ఉపాధ్యాయులను నెమరవేసుకుంటూ ఆ ఉపాధ్యాయులు యాదికొస్తున్నారని గుర్తు చేసుకోవడం ఉపాధ్యాయుల పనితీరుపై ఉంటుందని తెలిపారు. లోపలి పేజిలో

---

## గ్రంథాలయ సెస్ బకాయిలు చెల్లించాలి

- గ్రంథాలయ సెస్ కమిటీ చైర్మన్ ఫైజన్ అహ్మద్
- మున్సిపాలిటీలు నెలకు రూ. 2 లక్షలు చెల్లించేలా చర్యలు



లోపలి పేజిలో

## ఈనెల 13న ఉప్పల్ భాగయత్ లో ఆర్యవైశ్య మహాసభ భూమి పూజ

### యాచారంలో సన్నాహక సమావేశం



**యాచారం,సెప్టెంబర్ 11(జనం సాక్షి )** ఈనెల 13న ఉప్పల్ భాగయత్ లో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ భూమి పూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాచారం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వీరబొమ్మల శ్రీనివాస్ గుప్త పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరావతి లక్ష్మీనారాయణ గుప్త ఆధ్వర్యంలో జరిగే ఈ భూమి పూజకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నట్లు తెలిపారు. కావున యాచారం మండలంలోని ఆర్యవైశ్య సంఘ సభ్యులు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా కమిటీ చైర్మన్ ప్రొద్దుటూరి రవీందర్ గుప్తా, మండల ప్రధాన కార్యదర్శి పోలిశెట్టి సత్యనారాయణ గుప్త, కోశాధికారి ఆలంపల్లి యాదగిరి గుప్తా, నాయకులు ప్రొద్దుటూరి సురేందర్ గుప్త, విషంశెట్టి సంతోష్ గుప్త, నాళ్ల మురళీ కృష్ణ గుప్త, యాదగిరి గుప్త, సోమ లింగం గుప్త, గుద్దేటి ప్రవీణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ లో అటవీ అమరవీరుల దినోత్సవం

### అమరులను స్మరించుకున్న అధికారులు



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 11 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా అటవీ కార్యాలయంలో శుక్రవారం అటవీ అమరవీరుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అటవీ సంపద, వన్యప్రాణులు ప్రకృతి పరిరక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అటవీ అమరవీరులను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా అటవీ అధికారి విశాల్ అటవీ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారి సేవలను కొనియాడారు.కార్యక్రమంలో వికారాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ కె. శ్యామ్ కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీ పి. నాగేశ్వర్ రావు, ధారూర్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ బి. రాజేందర్, కొడంగల్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీ వి. విజయ్ కుమార్, పరిగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీమతి జి. ప్రతిమతో పాటు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవ సభను విజయవంతం చేయాలి



**చేవెళ్ల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి)** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 13న చేవెళ్లలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న నియోజకవర్గ స్థాయి సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ మక్బూల్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్ర, పోరాట యోధుల త్యాగాలను స్మరించుకునే ఈ కార్యక్రమానికి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణవాదులు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సకాలంలో సభా ప్రాంగణానికి చేరుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

### అనుమతులు లేకుండా నిర్మిస్తే కఠిన చర్యలు మున్సిపల్ కమిషనర్ బి.యాదగిరి

**చేవెళ్ల, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):** చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ యాదగిరి హెచ్చరించారు. పట్టణం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందేందుకు ప్రతి ఒక్కరూ మున్సిపల్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి నిర్మాణం చేపట్టినా తెలంగాణ బిల్డింగ్ అండ్ లేఔట్ అప్రూవ్డ్ సిస్టం ద్వారా ముందస్తు అనుమతి పొందిన తర్వాతే పనులు ప్రారంభించాలని తెలిపారు. అనుమతి పత్రంలో పేర్కొన్న ప్లాన్, కొలతల ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని, అనుమతికి విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం, ఆక్రమణలకు పాల్పడటం వంటి డివియేషన్లను సహించేది లేదన్నారు. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, అవసరమైతే కూల్చివేతకు సిఫార్సు చేస్తామని పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తెలంగాణ మున్సిపల్ చట్టం-2019 ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అక్రమ కట్టడాలకు మంచినీటి కనెక్షన్లు కూడా తొలగిస్తామని స్పష్టం చేశారు. ప్లాట్లు, ఇళ్లు కొనుగోలు చేసే సమయంలో సంబంధిత నిర్మాణాలకు మున్సిపల్ అనుమతులు ఉన్నాయో లేదో ముందుగానే పరిశీలించాలని ప్రజలకు సూచించారు. అనుమతులు లేని అక్రమ నిర్మాణాలను కొనుగోలు చేసి నష్టపోవద్దని కమిషనర్ కోరారు. ముఖ్యంగా ఇంటి నిర్మాణానికి అనుమతి పొందిన ప్రతి ఒక్కరూ నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో తప్పనిసరిగా ఇంటి నిర్మాణ అనుమతి పత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని కమిషనర్ సూచించారు.



# ఆయిల్ ఫామ్ తోటలతో సాగుతో అధిక లాభాలు

### జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల జిల్లా అధికారి ఎంఏ సత్తార్



**వికారాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 11 (జనం సాక్షి):** కోడంగల్ నియోజకవర్గ రైతులకు నారాయణపేట జిల్లాలో ఆయిల్‌పామ్ తోటలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లువికారాబాద్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్ తెలియజేశారు.కోడంగల్ నియోజకవర్గానికి చెందిన రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ప్రాయోగిక అవగాహన కల్పించేందుకు ఈరోజు నారాయణపేట జిల్లాలో ఎక్స్‌పోజర్ విజిట్ (అవగాహన పర్యటన) నిర్వహించారు.ఈ పర్యటనలో భాగంగా రైతులు ఫలదీకరణ దశలో ఉన్న ఆయిల్‌పామ్ తోటలను సందర్శించి, తోటల సంరక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్న సిబ్బందితో ప్రత్యక్షంగా చర్చించారు. ఆయిల్‌పామ్ పంట నిర్వహణ పద్ధతులు, ఫలదీకరణ దశలో ఉన్న తోటల నిర్వహణ, అవసరమైన యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రైతులు ప్రాయోగిక అవగాహన పొందారు.అలాగే, ఆయిల్‌పామ్ సాగు ద్వారా కలిగే ప్రయోజనాలు, దీర్ఘకాలికంగా పంటను సమర్థవంతంగా నిర్వహించాల్సిన విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు.రైతులు ఉత్సాహంగా పాల్గొనడంతో ఈ అవగాహన పర్యటన విజయవంతంగా పూర్తయింది. రైతులు ప్రత్యక్షంగా తోటలను పరిశీలించడం ద్వారా ఆయిల్‌పామ్ సాగుపై మరింత అవగాహన పొందారు.

# చలో అసెంబ్లీ పిలుపుతో ముదిరాజ్ నేతల ముందస్తు అరెస్ట్

### ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్

**యాచారం, సెప్టెంబర్ 11(జనం సాక్షి )** ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రంలోని ముదిరాజ్ సంఘాలు చేపట్టిన 'చలో అసెంబ్లీ' ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా యాచారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నీలం శ్రీకాంత్ ముదిరాజ్,మండల ప్రధాన కార్యదర్శి, కానెమోని గణేష్, ఉపాధ్యక్షులు యారా అశోక్ లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి ముదిరాజ్ సంఘాలు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఉదయమే పోలీసులు తన ఇంటికి వచ్చి ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉందని, ప్రభుత్వం ఈ అంశంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ముదిరాజ్‌ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోవడం కాకుండా ముదిరాజ్‌ల సమస్యలపై ప్రభుత్వం చర్చించి తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.,



# మంజూరైన రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలి

### మహేశ్వరం నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు పాదయాత్ర చేసిన బీజేపీ నాయకులు

**మహేశ్వరం,సెప్టెంబర్11(జనంసాక్షి):** మహేశ్వరం మండలంలో హెచ్ఎండిఏ ప్రాజెక్టు కింద మంజూరైన 12 గ్రామాల రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ అన్నారు.శుక్రవారం మహేశ్వరం మండల కేంద్రం నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు బీజేపీ నాయకులు పాదయాత్ర చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి బీజేపీ నేతలు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూళ్ల వీరేందర్ గౌడ్ మాట్లాడుతూ...మహేశ్వరం మండలంలోని మన్సాన్ పల్లి చౌరస్తా, డబిల్ గూడ,నాగిరెడ్డిపల్లి నుంచి ఎస్టీఆర్ తండా,మొహబ్బత్ నగర్ నుంచి తుమ్మలూరు, నాగిరెడ్డిపల్లి నుంచి అమీర్ పేట్, దుబ్బచర్ల నుంచి సుభాన్ పూర్, అమీర్ పేట్ నుంచి సుభాన్ పూర్ వయా మాణిక్యమ్మ గూడ, కేకేబస్తి,పులిమక్త నుంచి సంఘీగూడ,కోళ్ల పడకల్ నుంచి సుభాన్ పూర్, వయా దిల్వార్ గూడ, నల్ల చెరువు తండా నుంచి పెంజర్ల,అమీర్ పేట్ నుంచి పెండ్యాల గ్రామాల రోడ్లకు హెచ్ఎండిఏ నుంచి నిధులు మంజూరై ఏడాది గడుస్తున్న నేటికీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు.మహేశ్వరం మండలంలోని గ్రామాల రోడ్లు గుంతల మయంగా మారాయన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి,బీజేపీ నేతలు అందెల శ్రీరాములు యాదవ్,బొక్క నర్సింహ రెడ్డి,పాపయ్య గౌడ్,దేవేందర్ రెడ్డి,అనంతయ్య గౌడ్,కడారి జంగయ్య యాదవ్,మిద్దె సుదర్శన్ రెడ్డి ,పోతర్ల సుదర్శన్ యాదవ్,ఆయిల్ల యాదయ్య గౌడ్,మాధవచారి, కుండే వెంకటేష్,బీజేపీ పార్టీ మహేశ్వరం మండల అధ్యక్షుడు యాదిష్,ప్రధాన కార్యదర్శులు వనంపల్లి శ్రావణ్,ఉపేందర్,పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఉప్పల్ భగాయత్‌లో ఆధ్యాత్మిక, సామాజిక సందడి

### 13న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి భూమిపూజ.. సీఎం రేవంత్‌రెడ్డి హాజరు



**ఉప్పల్, సెప్టెంబరు 11 (జనం సాక్షి):** ఉప్పల్ భగాయత్‌లో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలతో సందడి నెలకొంది. అమావాస్య సందర్భంగా భగాయత్‌లోని కాలభైరవ స్వామి దేవాలయంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించగా.. మరోవైపు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి ఈ నెల 13న భూమిపూజ నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు అమావాస్య సందర్భంగా కాలభైరవ స్వామి దేవాలయంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలభైరవ స్వామి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలకు శాంతి, సౌభాగ్యం కలగాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.13న ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవనానికి భూమిపూజ ఇదిలా ఉండగా.. ఉప్పల్ భగాయత్‌లో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన సముదాయ నిర్మాణానికి ఈ నెల 13న భూమిపూజ నిర్వహించనున్నారు. ఆదివారం అంగరంగ వైభవంగా జరిగే ఈ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు భూమిపూజ, అనంతరం శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం జరగనుంది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరు భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. పలువురు రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, ఆర్యవైశ్య ప్రముఖులు, వివిధ ఆర్యవైశ్య సంఘాల నాయకులు పాల్గొననున్నారు.ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కార్యక్రమ ఏర్పాట్లను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరిశీలించారు. భూమిపూజ, శ్రీనివాస కల్యాణం, ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనానికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని కోరారు.ఆర్యవైశ్య సమాజం ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచేలా నిర్మించనున్న ఈ భవన సముదాయానికి భూమిపూజ కార్యక్రమం చారిత్రాత్మకంగా నిలవనుందని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్యులు, సంఘాల ప్రతినిధులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

### దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక డిమాండ్



**హయత్‌నగర్, సెప్టెంబర్ 11 (జనం సాక్షి):**ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి చేసిన అనుచిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం హయత్‌నగర్ మండల కేంద్రంలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీ గేటు బయట జరిగిన సంఘటనకు స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు ఎలాంటి సంబంధం లేకపోయినా, ఆయనను ఉద్దేశించి అనుచిత పదజాలం ఉపయోగించడం సరికాదన్నారు. ఒక దళితుడు అత్యున్నత రాజ్యాంగ పదవిలో ఉండటాన్ని ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారిని గౌరవించాలని, వ్యక్తిగత దూషణలకు పాల్పడటం తగదని పేర్కొన్నారు.దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే సహించేది లేదని నాయకులు స్పష్టం చేశారు. తాతా మధుపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెలమకంటి దయాకర్, దళిత నాయకుడు పారంద స్వామి, ఎంఆర్‌పిఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర రవీందర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బి. సుధాకర్ మాదిగ, ఎస్ఆర్‌పిఎస్ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ ఇరిగి రమేష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్లారి భాస్కర్, టీఎస్‌పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జెనిగె రమేష్, నీరజ గౌడ్, నోముల సతీష్ యాదవ్, వాసు యాదవ్, క్యాదసు సతీష్ మాదిగ, కొంగరి నవీన్ మాదిగ, కొమ్ము శివ మాదిగ, ఎస్. విజయ్ కుమార్, కరోతి కుమార్, పి. జగదీష్, కందాడి మనీ, కె. ఆదం తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా విజయవంతంగా నిర్వహించాలి

### ఆర్డీఓ కర్ర అనిత



**తాండూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి)** వినాయక చవితి ఉత్సవాలను మరియు నిమజ్జనోత్సవాల ను పురస్కరించుకొని తాండూరు డివిజన్ ఆర్డీఓ కర్ర అనిత ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. తాండూరు డివిజన్ పరిధిలో గణేష్ ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆర్ అండ్ బి, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొని ఉత్సవాల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. గణేష్ మండపాల ఏర్పాటు, నిమజ్జన కార్యక్రమాలు, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, భక్తులకు అవసరమైన మౌలిక వసతులు వంటి అంశాలపై శాఖల వారీగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కర్ర అనిత మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో పాటు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన కూడళ్లు, గణేష్ మండపాలు, నిమజ్జన మార్గాల్లో అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. విద్యుత్ వైర్లు, పారిశుధ్యం, రహదారులు, తాగునీరు తదితర అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా సంబంధిత శాఖలు ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు.గణేష్ ఉత్సవాలు సామరస్యానికి ప్రతీకగా నిలిచేలా నిర్వాహకులు, భక్తులు అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలు, ఉత్సవ కమిటీలు నిబంధనలను పాటిస్తూ ఉత్సవాలను విజయవంతం చేయాలని అధికారులు సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్‌రెడ్డి,డీఎస్పి నర్సింగ్ యాదయ్య, సిఐలు, మున్సిపల్ కమిషనర్, ఆర్ అండ్ బి డి ఈ, విద్యుత్ డి ఈ, ఏఈ, వైద్యశాఖ , ఎక్సైజ్ శాఖ, అటవీశాఖ, మత్స్యశాఖ, తాండూర్ తహసిల్దార్, ఎంపీడీవో, యాలాల్ తహసిల్దార్ ఎంపీడీవో, తదితర శాఖలకు చెందిన అధికారులు పాల్గొని ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై తమ సూచనలు, అభిప్రాయాలను వెల్లడించారు.

## వాసవి మాత ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**హయత్‌నగర్, సెప్టెంబర్ 11 (జనం సాక్షి)**హయత్‌నగర్, కుంట్లూర్ రోడ్డులోని వీరభద్ర పూజా సెంటర్ వద్ద వాసవి మాత ఆధ్వర్యంలో గురువారం భక్తులు, ప్రజల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులకు రుచికరమైన అన్నం, కూరలు, పప్పు, సాంబారు తదితర ప్రసాదాలను అందించారు. నిర్వాహకులు భక్తులకు ప్రేమాభిమానాలతో ప్రసాదాన్ని వడ్డిస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు.ప్రతి నెలా అమావాస్య రోజున భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని వాసవి మాత కృపతో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మికతతో పాటు సేవా భావాన్ని పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన భక్తులు, దాతలు, సేవా కార్యకర్తలు, ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## శ్రీ భావిగి భద్రేశ్వర ఆలయంలో శ్రావణమాస బసవ ప్రవచనాలు

### పేపర్ ఆర్ట్ తో ఆకట్టుకున్న చిన్నారి స్రుతిక



**తాండూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి)** శ్రీ భావిగి భద్రేశ్వర ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా నిర్వహిస్తున్న బసవ ప్రవచనాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి.ఈ సందర్భంగా సురేష్ కూతురు చిన్నారి స్రుతిక తన కళా నైపుణ్యంతో పేపర్ అక్షరాలతో మడపతి రాజశేఖర్ స్వామి పేరును కళాత్మక రూపంలో పొందుపరిచి రాజశేఖర్ స్వామికి అందజేసి అందరినీ ఆకట్టుకుంది.అనంతరం మఠపతి స్వామి మాట్లాడుతూ శ్రావణ మాసం ఎంతో పవిత్రమైనది. బసవన్న బోధనలు నేటి సమాజానికి ఎంతో అవసరం. చిన్నారి స్రుతిక తన కళతో భగవంతుని పట్ల భక్తిని చాటుకోవడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తుల కోరికలు తీర్చే మహిమాన్వితం శ్రీ కట్ట మైసమ్మ

### మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్శ విఠల్ నాయక్



**తాండూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి)** భక్తులు కోరుకున్న కోరికలు తీర్చే మహిమగల దేవత శ్రీ కట్ట మైసమ్మ అని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆలయ గౌరవ అధ్యక్షుడు వర్శ విట్టల్ నాయక్ అన్నారు.శుక్రవారం పొలేర అమావాస్య సందర్భంగా పట్టణంలోని ఆదర్శ్ నగర్ పాతకుంటలో వెలసిన శ్రీ కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా విట్టల్ నాయక్ మాట్లాడుతూ శ్రీ కట్ట మైసమ్మ మహా మహిమగల దేవత, భక్తులు కోరుకున్న కోరికలు తీర్చే దైవం. ప్రతి సంవత్సరం ఒకసారి వచ్చే పొలేర అమావాస్య అత్యంత పవిత్రమైనదన్నారు. శ్రావణ మాసం ముగింపు అమావాస్య సందర్భంగా ఆలయంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ కట్ట మైసమ్మ ఆశీస్సులు తాండూరు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అల్లంపల్లి ప్రకాష్, నవీన్ కంఠం, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో మహా ఇష్టలింగ పూజ

### రాకేష్ గురూజీ పాద పూజా



తాండూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి) పట్టణం లోని భవానీ శంకర మఠంలో గురువారం మహా ఇష్టలింగ పూజ మరియు డా. రాకేష్ గురుజీ పాద పూజా కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ భక్తులందరి సంక్షేమం కోసం, సర్వ శుభాల కోసం ఈ మహా ఇష్టలింగ పూజను నిర్వహిస్తున్నాము. ఇష్టలింగ పూజలో పాల్గొనడం ద్వారా భక్తులకు సకల దోషాలు తొలగిపోయి, ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలుగుతాయన్నారు.

## బిల్ కలెక్టర్లు, స్పాట్ బిల్లర్లకు కనీస వేతనం చెల్లించాలి

### టీఎస్ఐయూఈయూ--సీఐటీయూ డిమాండ్



ముషీరాబాద్, సెప్టెంబర్ 11 ( జనం సాక్షి): తెలంగాణ విద్యుత్ సంస్థలైన ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్‌లో 15--20 ఏళ్లుగా పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, స్పాట్ బిల్లర్లకు కార్మిక శాఖ జారీ చేసిన జీఓ నెం.6 ప్రకారం రూ.18,500 కనీస వేతనం చెల్లించాలని టీఎస్ఐయూఈయూ--సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్దగల ధర్నా చౌక్లో ధర్నా నిర్వహించారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం రైతుల నుంచి భూములు సేకరించి, వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలతో సరిపెట్టారని సంఘం ఆరోపించింది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని ఎనిమిది సబ్‌స్టేషన్లలో భూములు ఇచ్చి ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఏడాది కాలంగా వేతనాలు అందడం లేదని పేర్కొంది. ప్రతి నెల 1 నుంచి 10వ తేదీ వరకు మాత్రమే స్పాట్ బిల్లర్లకు పని ఉంటోందని, మిగిలిన రోజుల్లో పని హామీ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపింది. పీస్‌రేట్ విధానాన్ని రద్దు చేసి, నెలలో 30 రోజులు పని కల్పించాలని, బిల్ కలెక్టర్లు, స్పాట్ బిల్లర్లకు జీఓ నెం.6 ప్రకారం రూ.18,500 కనీస వేతనం అమలు చేయాలని టీఎస్ఐయూఈయూ--సీఐటీయూ డిమాండ్ చేసింది.

## దేవరయాంజాల్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్ట్‌ల పంపిణీ

### జిల్లా ఆర్ టి ఏ మెంబర్ జైపాల్ రెడ్డి



శామీర్ పేట్, సెప్టెంబర్ 11(జనం సాక్షి )విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి అన్నారు. శామీర్‌పేట్ డివిజన్ దేవరయాంజాల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వం అందించిన యూనిఫామ్స్, బెల్ట్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్ రెడ్డి హాజరై విద్యార్థులకు యూనిఫామ్స్, బెల్ట్‌లను పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో దూసుకెళ్లాలి

### విద్యాజ్యోతి కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ డాక్టర్ పల్ల రాజేశ్వర్ రెడ్డి



మొయినాబాద్.. జనం సాక్షి సెప్టెంబర్ 11: వాస్తవ ప్రపంచ సమస్యలకు విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు దూసుకెళ్లాలని విద్యాజ్యోతి కళాశాల కరస్పాండెంట పల్ల రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీత్ నగర్ చౌరస్తాలో గల విద్యాజ్యోతిఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు ఇంటర్నేషనల్ స్మార్ట్ ఇండియా ఏకతా 20 26 కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి వివిధ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొని విజయవంతంగా చేశారు. ఈ ఏకతా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల కార్యదర్శి కరస్పాండెంట్ పల్ల రాజేశ్వర్ రెడ్డి పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నేటి ప్రపంచంలో పోటీ తత్వం ఎంతో పెరిగిపోయిందని దానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను రూపొందించుకునేందుకు తమ ఆలోచనలు సృజనాత్మక సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి ఏకత కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఇలాంటి కార్యక్రమాలలో విద్యార్థులు పాల్గొన్నప్పుడే మీ పరిజ్ఞానాన్ని పరీక్షించుకోగలుగుతారని తెలిపారు కళాశాలలో నిర్వహించిన ఇంటర్నేషనల్ స్మార్ట్ ఇండియా విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు విద్యార్థులలో క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే దేనినైనా సాధించగలుగుతారని తెలిపారు ఈ కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన నిపుణులు డైమండ్ నిపుణులు పూర్వ విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టులను ప్రచురించి ప్రధాన ఆకాశంగా నిలిచారు ప్రాజెక్టుల ద్వారా సాంకేతిక సాధ్యత ప్రసంగిత విస్తీర్ణ సామర్థ్యం సామాజిక ప్రభావం ఆధారంగా మూలంఖ్యానంచేశారు. ఈ ఏకత్వం కార్యక్రమంలో కళాశాల జైంట్ సెక్రెటరీ డాక్టర్ . నీలిమ ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన. కళాశాల డి డాక్టర్ పద్మజ అకిటేషన్ మరియు రాకిన్గ్స్ జి శ్రీలత అకాడమిక్ కోఆర్డినేటర్ ఆర్ వెంకటాచలం అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ ప్లేస్మెంట్ డాక్టర్ ఏ ఓబులేష్ హెచ్ ఓ డి ఐటీ కన్వీనర్ రాంబాబు . కో కన్వీనర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పనులను సమాజానికి తెలియపరుస్తాం

### టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్

### టీపీసీసీ సమన్వయ కర్తగా గౌరీ సతీష్ ఎంపిక



మొయినామాబాద. జనం సాక్షి సెప్టెంబర్ 11:: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియపరిచేందుకు కృషి చేస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి నక్కలపల్లి గౌరీ సతీష్ అన్నారు. గురువారం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ 33 జిల్లాలకు టీపీసీసీ సమన్వయ కర్తలుగా నియమించడం జరిగిందని తెలిపారు. అందులో మొయినాబాద్ మండలం నక్కలపల్లి గ్రామ నివాసి గౌరీ సతీష్ను నియమించినట్లు తెలిపారు. సికింద్రాబాద్ జిల్లాకు టీపీసీసీ సమన్వయ కర్తగా నియమించడంతో సికింద్రాబాద్ జిల్లాలోని నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో కలిసి ప్రజా ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధిని ఇంటింటికి తీసుకువెళతామన్నారు. బీఆర్ఎస్ చేస్తున్న అసత్య ఆరోపణలు ప్రజలకు తెలియజేయడానికి ఇటీవల స్వతంత్ర ప్రతిపత్తి గల స్పీకర్వల్ల, దళితుల పట్ల బీఆర్ఎస్ చేస్తున్న వ్యవహార శైలిని ప్రజలందరికి తెలియజేస్తు సమాజానికి తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమాజానికి తెలియజేయడానికే రాష్ట్రంలో 33 జిల్లాలకు టీపీసీసీ సమన్వయ కర్తలుగా నియమించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్కుమార్గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, ఎంపీ చామల కుమారెడ్డిలకు ఆయనను సికింద్రాబాద్ జిల్లాకు ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# దళితులు నడిచిన నేలను బి.ఆర్.ఎస్ శుద్ధి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం

### : తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొనింటి సురేష్



మోమిన్ పేట, సెప్టెంబర్ 11, (జనం సాక్షి)మాజీ సీఎం కేసీఆర్ ఫామ్ హౌస్ వద్దకు దళితులు వచ్చారనే కారణంతో బీఆర్ఎస్ నాయకులు పసుపు నీళ్లు చల్లి శుద్ధి చేయడాన్ని తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కొనింటి సురేష్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో మాట్లాడారు. ఈ సందర్భంగా తెలంగాణ సర్పంచుల ఐక్యవేదిక రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొనింటి సురేష్ .. దళితులను చిన్నచూపు చూడటం, వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య సమాజంలో సరికాదన్నారు. ఇలాంటి చర్యలు సామాజిక సమానత్వానికి విరుద్ధమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో కేటీఆర్, హరీష్‌రావు ను ఓడిస్తామని హెచ్చరించారు. అదేవిధంగా దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కొనింటి సురేష్ తెలిపారు. ప్రజా ప్రతినిధుల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని అన్నారు. తక్షణమే బీఆర్ఎస్ నాయకులు దళిత సమాజానికి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలి

### : సీఈవో వెంకటేశ్వరరెడ్డి

మల్కాజిగిరి సెప్టెంబర్ 11 (జనం సాక్షి)అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని అదనపు ఎన్నికల ప్రధానాధికారి వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా చేపడుతున్న నమోదు కార్యక్రమాలను అధికారులు మరింత వేగవంతం చేయాలని అదనపు ప్రధాన ఎన్నికల అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. మల్కాజిగిరి పరిధిలోని ఆనంద్‌బాగ్ కమ్యూనిటీ హాల్‌లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను వారు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన ఓటర్ల నమోదు, మార్పులు-చేర్పుల వివరాలను బూత్ స్థాయి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన అధికారులు, రానున్న రోజుల్లో ప్రక్రియను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్లాలని పలు సూచనలు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ నరసింహారెడ్డి, బీఎల్‌వో సూపర్‌వైజర్ రఘు, బీఎల్ఏ-1 ప్రీతం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలి

## నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్



**ముషీరాబాద్, సెప్టెంబర్ 11 (జనం సాక్షి):**తెలంగాణలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లకు పనికి తగ్గ వేతనాలు చెల్లించాలని ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ టియుసిఐ డిమాండ్ చేసింది. వేతనాలను వెంటనే పెంచడంతో పాటు నైట్ డ్యూటీలను రద్దు చేసి, వారానికి ఒకరోజు వీక్లీ ఆఫ్ అమలు చేయాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఎల్. పద్మ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 495 కేజీబీవీలు ఉండగా, సుమారు 7 వేల మంది నాన్ టీచింగ్ సిబ్బంది, వర్కర్లు తీవ్రమైన పనిభారంతో తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారని అన్నారు. కేజీబీవీలు బాలికల విద్యాభివృద్ధికి కీలకంగా పనిచేస్తున్నప్పటికీ, అందులో పనిచేస్తున్న సిబ్బందికి శ్రమకు తగిన ప్రతిఫలం అందడం లేదని పేర్కొన్నారు. వారి సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించడంతో పాటు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.సిపిఐ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు,టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు కే. సూర్యం, యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్.ఎల్. పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ తదితరులు మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బంది సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా వేతనాలు పెరగకపోగా పనిభారం మాత్రం పెరిగిందని వారు ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం 2024లో ఏడు సార్లు, 2025లో ఐదు సార్లు, 2026లో ఇప్పటివరకు ఐదు సార్లు ప్రభుత్వం, ప్రజావాణి, ఎస్పీడీకి వినతిపత్రాలు అందజేశామని తెలిపారు. అలాగే స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయం ఎదుట రెండు సార్లు 500 మందికి పైగా సిబ్బందితో ధర్నాలు నిర్వహించినా ప్రభుత్వం, అధికారులు స్పందించలేదని అన్నారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి కేజీబీవీ సిబ్బంది వేతనాలను సమీక్షించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన జీవో నంబర్ 6 ప్రకారం కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాబ్‌చార్టుకు విరుద్ధంగా అకౌంటెంట్లు, వర్కర్లకు కేటాయిస్తున్న నైట్ డ్యూటీలను రద్దు చేయాలని, వారానికి ఒకరోజు సెలవు అమలు చేయాలని కోరారు. అదేవిధంగా ఖాళీ పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని, ప్రభుత్వ ఉద్యోగాల్లో అర్హత కలిగిన నాన్ టీచింగ్ సిబ్బందికి వెయిటేజీ కల్పించాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ వయసును 65 ఏళ్లకు పెంచడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలను అమలు చేసి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్, అరుణ, సహాయ కార్యదర్శులు హేమలత, షాహిబా, అలివేలు, వీరమణి, రాష్ట్ర నాయకులు శశికళ, సుమలత, అశోక్, సాంబశివుడు, రమేశ్, రమ, చంద్రకళ, లక్ష్మి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమను నిలబెట్టేందుకు ప్రభుత్వం రాయితీలతో ప్రోత్సాహకాలు కల్పించాలి

## అసెంబ్లీలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

**తాండూరు సెప్టెంబర్ 11(జనంసాక్షి)**నియోజకవర్గంలోని నాపరాతి పరిశ్రమను అదుకుని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అసెంబ్లీలో కోరారు.శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, కొత్తగా వెలుగులోకి వస్తున్న టైల్స్ వంటి పరిశ్రమలతో తాండూరు రాతి పరిశ్రమకు తీవ్ర పోటీ ఎదురవుతోందని అన్నారు. పరిశ్రమను నిలబెట్టేందుకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.అలాగే మాట్లాడుతూ, తాండూరు రాతి పరిశ్రమపై ఆధారపడి వేలాది మంది కార్మికులు, వ్యాపారులు, రవాణా రంగానికి చెందిన వారు జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించిన 18 ఎకరాలు, ఆటోమొబైల్ రంగానికి కేటాయించిన 10 ఎకరాలను వెంటనే కేటాయించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.దీనికి మంత్రి శ్రీధర్ బాబు స్పందిస్తూ, క్వారీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి, తాండూరు రాతి పరిశ్రమను ముందుకు తీసుకెళ్లేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అసెంబ్లీలో పరిశ్రమ సమస్యను ప్రస్తావించడంతో తాండూరు క్వారీ అసోసియేషన్, వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# 22ఏ పేరుతో రైతుల భూములపై హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వం

## ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 11 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగా ణలో నయా భూ దోపిడీకి తెరలేపిందని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. సామాన్యులు, రైతుల భూములపై హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ఆస్తుల ను కొల్లగొడుతున్నారని విమర్శించారు.శుక్రవారం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు . 22ఏ పేరుతో సామాన్యులు, రైతుల భూములను ప్రభుత్వం లాక్కుంటోందని మన్నె గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ప్రజలకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం వారి భూముల విషయంలో భయాందో ళనలు సృష్టించడం దుర్మార్గమన్నారు. రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కేవలం రూ.7 కోట్లకే డమ్మీ కంపెనీలకు కట్టబెడుతున్నారని ఆరో పించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రభుత్వ ఆస్తులనే విక్రయిస్తోందని విమర్శించారు. తమ వ్యాపార ప్రయోజనాల కోసం సీఎం రేవంత్ రెడ్డి కుటుంబం, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పోటీపడి రాష్ట్ర భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రె స్ ప్రభుత్వం 1.01 కోట్ల ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో పెట్టిందని, ఇప్పటికీ లక్షల ఎకరాల భూములు ఆ జాబితాలో ఉన్నాయని తెలిపారు. 22ఏ జాబితా నుంచి భూములను తొలగించేందుకు లంచాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఇప్పటివరకు ఎంత భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించారనే దానిపై సరైన లెక్కలు లేవన్నారు. 22ఏ నిషేధిత భూముల వ్యవహారం పొరపాటుగా జరిగినది కాదని, పక్కా ప్రణాళికతో జరిగిన కుట్ర అని మన్నె గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఈ వ్యవహారం బయ టపడటంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తన ఫ్రస్టే షన్‌ను అధికారులపై చూపుతున్నారని విమర్శిం చారు. 22ఏ భూముల వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీస్తుందని భయ పడే తమ పార్టీ సభ్యులను సభకు రాకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి రాష్ట్రా న్ని దోచేస్తున్న భూ బకాసురులుగా వ్యవహరిస్తు న్నారని తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు, ప్రజలను ఇబ్బం దులకు గురిచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజల తరపున పోరా డుతుందని మన్నె గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు.




## నెక్నాంపూర్ చెరువును మంచి నీటితో నింపాలి

**రాజేంద్రనగర్,సెప్టెంబర్11(జనంసాక్షి):**ఈనెల 14 నుంచి ప్రారంభమయ్యే వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా నెక్నాంపూర్చె రువులో గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులు, నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని కోరారు. చెరువును శుభ్రం చేసి మంచినీటితో నింపాలని, లైటింగ్, ట్రాఫిక్ నియంత్రణ, అత్యవసర బృందాలు, తాగునీటి ప్యాకెట్ల ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్ కుమార్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్ రెడ్డి, అధ్యక్షుడు బి. రవికాంత్ రెడ్డి,జె.సిద్ధప్ప, మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్ స్వామి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చిలుకూరి బీరప్ప, బట్ట సత్యనారాయణ, శంకర్ సింగ్, సత్యనారాయణ, ఆనంద్ రావు, బి. శివకుమార్ తదితర బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేందర్ ముదిరాజ్ ఎన్నిక

## కాంగ్రెస్ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**శంషాబాద్,సెప్టెంబర్11(జనంసాక్షి)** శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చిల్కమర్రి మహేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి మహేందర్ ముదిరాజ్ కృతజ్ఞతలు తెలిపారు. శంషాబాద్ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ కార్యకర్తలను కలుపుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# నార్సింగి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అశోక్ యాదవ్ ఎన్నిక



**రాజేంద్రనగర్,సెప్టెంబర్11(జనంసాక్షి):**రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని నార్సింగి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా అశోక్ యాదవ్ నియమితులయ్యారు. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ అభీష్టం మేరకు రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా శుక్రవారం నియామక పత్రాన్ని అందుకున్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి అశోక్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యకర్తలను చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరినీ కలుపుకొని, వారి సూచనలు, సలహాలు తీసుకుంటూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తానని నూతన అధ్యక్షుడు అశోక్ యాదవ్ తెలిపారు.

# 22ఏ బాధితులకు అండగా బీఆర్ఎస్



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 11 (జనం సాక్షి)**22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములు, ప్లాట్ల సమస్యను పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావును ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన 22ఏ బాధితులు కోరారు. తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో బాధితుల సమస్యలను కేటీఆర్, హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బీఆర్ఎస్ నాయకులు, 22ఏ బాధిత కాలనీల అధ్యక్షులు కార్యదర్శులు పాల్గొన్నారు.

# పర్యావరణ గణపతులనే ప్రతిష్టిద్దాం

## శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ



**శంషాబాద్, సెప్టెంబర్11(జనం సాక్షి)**వినాయక చవితి సందర్భంగా ప్రతి ఒక్కరు మట్టి గణపతి లను ప్రతిష్టించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని జిహెచ్ఎంసి శంషాబాద్ జోనల్ కమిషనర్ కె. చంద్రకళ తెలిపారు. శుక్రవారం ఆమె డిప్యూటీ కమిషనర్ బి. సుమన్ రావు సమక్షంలో పర్యావరణహితమైన మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. గ్రీన్ ఎర్త్ ఇంటిగ్రేటెడ్ ఫెసిలిటీ ఆధ్వర్యంలో, సంస్థ ప్రతినిధి నాగరాజ్ యాదవ్ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు ప్రజలు మట్టి గణేష్ విగ్రహాలను వినియోగించి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

## పోచమ్మ ఆలయం దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్



**రాజేంద్రనగర్,సెప్టెంబర్11(జనంసాక్షి)** ఖానాపూర్ గ్రామంలోని శ్రీ పోచమ్మ దేవాలయంలో జరిగిన చోరీ కేసును నార్సింగి పోలీసులు ఛేదించి నిందితుడు గుడాల తిలక్ అలియాస్ టిల్లు (20)ను అరెస్ట్ చేశారు. డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఏసీపీ జీవీ. రమణ గౌడ్ పర్యవేక్షణలో నార్సింగి పోలీసుల ఆధ్వర్యంలో కేసును ఛేదించారు. పోలీసుల వివరాల ప్రకారం ఈనెల 28న ఆలయ తాళాలు పగులగొట్టి అమ్మవారి బంగారు ముక్కుపుడక, రెండు పుస్తెలను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై గతంలో 13 ఆస్తి సంబంధిత కేసులు ఉండగా, మరో రెండు మోటార్‌సైకిల్ చోరీ కేసుల్లోనూ ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, చోరీకి గురైన బంగారు ఆభరణాల రికవరీకి చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు.

## గణేష్ ఉత్సవాల నిర్వహణపై అధికారుల సమన్వయం



**అల్వాల్, సెప్టెంబర్ 11 (జనంసాక్షి):**రానున్న గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని అల్వాల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ బోగేశ్వర్లు సూచించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో గణేష్ ఉత్సవ సమన్వయ సమావేశం నిర్వహించారు. విగ్రహాల ప్రతిష్ఠాపన, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్, పారిశుద్ధ్యం, తాగునీరు, భద్రత, నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ఉత్సవ నిర్వాహకులు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఈ మహేష్, అల్వాల్ సీఐ ప్రశాంత్, ట్రాఫిక్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, హైడ్రా, జలమండలి, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అల్వాల్ సర్కిల్ కో-కన్వీనర్ తూఫాన్ లక్ష్మణ్, మహిళా విభాగం కన్వీనర్ పద్మిని, మల్లికార్జున్‌గౌడ్, అజిత్‌సాయి తదితరులు హాజరయ్యారు.

## కేసీలమ్మ తండాలో పోషణ మాసం

### అంగన్వాడీ టీచర్ కవిత



**దోమ సెప్టెంబర్ 11 జనం సాక్షి:**:వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలో ని కేసీలమ్మ తండా లో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి సూపర్వైజర్ నర్సమ్మ మాట్లాడుతూ తల్లిపాలు పకృతి ప్రసాదించిన అమూల్యమైన వరమని అన్నారు. ప్రసవం జరిగిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని ముర్రపాలు శిశువుకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తాయని వివరించారు. పుట్టిన తర్వాత తొలి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని చేయడం జరిగింది. గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం చేయడం ఆరు నెలల పిల్లలకు అన్న ప్రసన్న కార్యక్రమ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ నర్సమ్మ, అంగన్వాడీ టీచర్ కవిత,దేవి ,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఇందిరమ్మ,గర్భిణీలు,బాలింతలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంసి పరిధి అనధికార నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ముమ్మర చర్యలు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 11 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) పరిధిలో అనధికార నిర్మాణంలో ఉన్న భవనాలపై కొనసాగుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మూడు జోన్లలో క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించి వాటి విషయంలో అవసరమైన చర్యలను తీసుకోవడం జరిగింది. ఈ తనిఖీల్లో దాదాపు 14 అనధికార నిర్మాణాలను అధికారులు గుర్తించినట్లు పేర్కొన్నారు. వీటిలో 13 అనధికార నిర్మాణాలను కూల్చివేయగా, 02 ఆక్రమణలకు నోటీసులను జారీచేయడం విశేషం. ఈ క్రమంలో తదుపరి కూల్చివేత మరియు ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యల కోసం నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం చర్యలను తీసుకొని ఉన్నామని అధికారులు తెలిపారు. సిఎంసి పరిధిలోని మూడు జోన్ల వారీగా కూల్చివేతలు శేరిలింగంపల్లి జోన్ పరిధిలో 03, కూకట్పల్లి జోన్ పరిధిలో 04 నిర్మాణాలు, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో 06 ఉన్నాయని ఉన్నతాధికారులు వివరించారు. ఇందులో భాగంగా సిఎంసి పరిధిలోని అనధికార నిర్మాణాలపై ప్రతిరోజూ క్షేత్రస్థాయి తనిఖీలు మరియు కఠిన పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత టౌన్ ప్లానింగ్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను సిఎంసి ఉన్నతాధికారులు అప్రమత్తం చేసినట్లు సంబంధిత అధికారులు తెలియజేశారు. అయితే భవన నిర్మాణ నిబంధనల అమలును నిర్ధారించేందుకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలను కొనసాగిస్తూ గుర్తించిన అన్ని అనధికార నిర్మాణాలపై నిర్దేశిత విధానం మరియు వర్తించే నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలను కచ్చితంగా చేపట్టడం జరుగుతుందని ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు తెలిపారు.

## హైదరాబాద్ విలీనం సిపిఐ పార్టీ ద్వారానే సాధ్యమైంది

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్



**నిజాంపేట్ సెప్టెంబర్ 11 జనం సాక్షి:** భారతదేశం అంతట మువ్వన్నెల జండా ఎగురవేసి సంబరాలు చేసుకుంటుంటే నిజాం యేలుబడిలోని హైదరాబాద్ సంస్థానం లోని ప్రజలు కట్టు బానిసలుగా ఇబ్బంది పడుతుంటే హైదరాబాద్ సంస్థానం భారతదేశం లో విలీనం చెయ్యాలని కోరుతూ కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చి 4500 గ్రామాలను విముక్తి చేసిందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా చేసి 10 లక్షల ఎకరాలను పేదలకు పంచి తెలంగాణ ను భారతదేశంలో విలీనం చేయించిన చరిత్ర సిపిఐ కె ఉందని, సాయుధ పోరాట చరిత్రను ప్రజలకు తెలియచెయ్యాల్సిన అవసరం కర్తవ్యశీ సిపిఐ కార్యకర్తలకు ఉందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. సాయుధ పోరాట పిలుపునిచ్చి నేటికీ సరిగ్గా 80 సంవత్సరాలు కావస్తున్న కారణంగా సాయుధ పోరాట వారోత్సవాలను నేడు ప్రారంభించడం జరిగింది. అందులో భాగంగా శుక్రవారం మఖ్దుం నగర్ నాగయ్య విగ్రహం దగ్గర కల అమరవీరుల స్తూపం దగ్గర పూలదండలు వేసి నివాళులు అర్పించారు. సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ లు పటేల్ సైన్యం వల్ల వచ్చిందని సాయుధ పోరాటాన్ని అవమానిస్తూ మన చరిత్రను గుజరాతీ వ్యక్తి కి గౌరవం తీసుకురావడం మన పోరాటాన్ని తగ్గిస్తున్నాయని అన్నారు. పటేల్ వచ్చాక నిజాం కాలంలో అరెస్టు అయ్యినవారిని,ఉరి శిక్ష పడ్డ వాళ్ళని విడిచిపెట్టలేదని చివరికి రాష్ట్రపతి వల్లే బయటకు వచ్చారని అన్నారు. సిపిఐ ఎక్కడ తెలంగాణ ను పరిపాలించి భూములను పంచితే భూస్వాములకు ఇబ్బంది గురయ్యే ప్రమాదం ఉందని గ్రహించే పటేల్ వచ్చారని అన్నారు. కావున తెలంగాణ సాయుధ పోరాటాన్ని స్మరిస్తూ రాబోయే తరాలకు నిజమైన చరిత్ర చెప్పాల్సిన బాధ్యత మన పై ఉన్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఏసురత్నం,మండల కార్యదర్శి స్వామి,సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు,ప్రజానాట్యమండలి బాబు,సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి, సహదేవరెడ్డి,వెంకటగిరి ,వెంకటేష్,శ్రీనివాస్ చారీ, శ్రీనివాస్,పెంటన్న ,కార్తీక్యువజన నాయకులు జంబూ, ధర్మేంద్ర,సాహు,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

## దళితులను అవమానపరిచిన బిఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు



**నిజాంపేట్ సెప్టెంబర్ 11 జనం సాక్షి:**కెసిఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నడిచిన రోడ్డు అపవిత్రమైందంటూ పసుపు నీటితో శుద్ధి చేసి దళితులను అవమానించిన బిఆర్ఎస్ నాయకులపై దుండిగల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సి డిపార్ట్మెంట్ చైర్మన్ కావలి చంద్రయ్య ఫిర్యాదు. బిఆర్ఎస్ నాయకులకు దళిత వర్గం వర్గం నాయకులంటే ఎప్పుడు చిన్న చూపుగానే చూడడం సరికాదని, జిల్లా కాంగ్రెస్ ఎస్ సి అంశానికి సంబంధించి తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా ఎస్సీ చైర్మన్ కావలి చంద్రయ్య తెలిపారు. డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు మెద్చల్-- మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ కావలి చంద్రయ్య ఈ మేరకు శుక్రవారం దుండిగల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నడిచిన రోడ్డు అపవిత్రమైందంటూ పసుపు నీటితో రోడ్డును శుద్ధి చేయడం ద్వారా దళితులను అవమానించిన నాయకుల చర్యలను నిరసిస్తూ దళితుల ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరించిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ సల్మాన్ రాజు ,296 అధ్యక్షుడు చెవిటి శ్రీనివాస్,294 అధ్యక్షుడు ప్రభాకర్ ,289 అధ్యక్షుడు ప్రసన్న కుమార్,286 అధ్యక్షుడు బి.వి. రంగయ్య,284 అధ్యక్షుడు గుద్దేటి రాజు,296 అధ్యక్షుడు కావలి శశికుమార్,దుండిగల్ మైనారిటీ అధ్యక్షుడు నయీమ్,దళిత సేన తెలంగాణ కె. అమృతయ్య,కాంగ్రెస్ నాయకుడు నర్సింహులు,20వ వార్డు మాజీ కౌన్సిలర్ మణి కుమార్,296 బీసీ అధ్యక్షుడు జకుల్ల మల్లేష్,అధ్యక్షుడు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యంలో వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరం

### జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ సెక్రటరీ రాధిక



**బంట్వారం సెప్టెంబర్ 11 జనం సాక్షి :**బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం అని జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ సెక్రటరీ రాధిక అన్నారు. బంట్వారం మోడల్ స్కూల్, కళాశాల ప్రిన్సిపాల్ బ్యూలా ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరంగా పరిగణించడం తో పాటు, బాల్య వివాహాలు ప్రోత్సహించిన వారికి కూడా శిక్షకు అర్హులవుతారని తెలిపారు. బాల్య వివాహాలను రూపుమాపటం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. భారతదేశంలో మోటార్ వాహానాల చట్టం సెక్షన్ 199ఎ ప్రకారం మైనర్ బాలురు వాహానాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులకు లేదా వాహన యజమానులకు రూ. 25వేల జరిమానా, 3 ఏండ్లు జైలు శిక్ష విధించనున్నట్లు తెలిపారు. 18 ఏండ్లు నిండని బాలికలపై లైంగికల వేధింపులు పాల్పడిన వ్యక్తులకు మూడేండ్ల నుంచి జీవిత ఖైదీ, మరణశిక్ష పడుతుం దని ఫోక్సో చట్టంపై, లోక్ అదాలత్, న్యాయపరమైన చట్టాలు పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన న్యాయ సహాయ రక్షణ న్యాయవాది వెంకటేష్, అసిస్టెంట్ ప్రధాన న్యాయ సహాయ రక్షణ న్యాయవాది శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.